క్లుప్తంగా

నేడు మంత్రి కాకాణి రాక

పొదలకూరు : జన భాగీధారి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం పట్టణంలోని నెల్లూరు మార్గంలో అంబేడ్కర్ విగ్రహానికి ఉదయం 10.30 గంటలకు పూలమాల వేసి నివాళులర్పిస్తారని ఎంపీడీఓ నగేష్‌కుమారి ఆదివారం తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో పాల్గొని రైతుల నుంచి వినతులు స్వీకరిస్తారని స్పష్టం చేశారు.

వీఎస్‌యూకు రాక

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)కు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య ఆదివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు వీఎస్‌యూ చేరుకుని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు.

యువకులపై దాడి

నెల్లూరు రూరల్: జనసేనకు చెందిన యువకులపై దాడికి పాల్పడిన ఘటన ధనలక్ష్మీపురంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ధనలక్ష్మీపురంలో జనసేన నేత శ్రీపతి రాము, టీడీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో కార్యక్రమం ముగిసిన అనంతరం యువకులు స్కూటీపై నెల్లూరు బయల్దేరారు. ఈ తరుణంలో ఆటోలో కొందరు వెంబడించి వీరిపై దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న జనసేన నేతలు అక్కడికి చేరుకుని ఆటోలో ఉన్న ఇద్దరికి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై లక్ష్మణ్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. గాయపడిన వారిని జీజీహెచ్‌కు 108లో తరలించారు. ఆటోలో ఉన్న రౌడీషీటర్లు దేవా, చింటూపై పలు కేసులు న్నాయని రూరల్ సీఐ సుబ్బారావు తెలిపారు. ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని చెప్పారు. కాగా యువకులపై దాడికి పాల్పడింది టీడీపీ నేతలని పలువురు ఆరోపిస్తున్నారు.

గంధ మహోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): చిన్నబజార్‌లోని ఖ్వాజా పీర్ సాహెబ్ నెల్లూరు పెద్ద దర్గా గంధ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని నిర్వాహకుడు బాబాసాహెబ్ బందనవాజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖ్వాజాపీర్ మకాన్ అస్సర్‌ఖర్ నుంచి రాత్రి బయల్దేరి సంతపేట, ములుమూడి బస్టాండ్ తదితర ప్రాంతాల మీదుగా సాగనుందని చెప్పారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

18 కిలోల కణితి తొలగింపు

నెల్లూరు సిటీ: నగరంలోని తమ ఆస్పత్రిలో 60 ఏళ్ల మహిళ కడుపు నుంచి 18 కిలోల కణితిని తొలగించామని దీప్తి నర్సింగ్ హోమ్ గైనకాలజిస్ట్ సుమతి, సర్జన్ లోకనాథం పేర్కొన్నారు. ఈ మేరకు వివరాలను వారు తెలియజేశారు. సైదాపురం మండలానికి చెందిన సీతారావమ్మ కొన్ని నెలలుగా కడుపుబ్బరం, వాంతులు, బరువు తగ్గడం లాంటి సమస్యలతో బాధపడసాగారన్నారు. ఈ క్రమంలో వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా ప్రయోజనం లేకపోవడంతో తమ ఆస్పత్రిని ఆశ్రయించారని చెప్పారు. పరీక్షల అనంతరం కణితి ఉందనే అంశాన్ని గుర్తించి ఆపరేషన్ ద్వారా తొలగించామని పేర్కొన్నారు.

చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆరాధనోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆరాధనోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని మందిర కమిటీ మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం ఆదివారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. చంద్రశేఖరేంద్ర సరస్వతి జీవ న వైశిష్ట్యంపై జంగా శివకుమార్ ఉపన్యసించనున్నారని చెప్పారు. ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేయనున్నామని తెలిపారు.

మోపూరు సాహితీ సేవలు ప్రశంసనీయం



మోపూరు వేణుగోపాలయ్య చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

నెల్లూరు(బృందావనం): సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య సేవలు ప్రశంసనీయమని పలువురు కొనియాడారు. మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో వేణుగోపాలయ్య చిత్రపటాన్ని ఆదివారం ఆవిష్కరించారు. నగరంలోని పది పాఠశాలలకు చెందిన 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు వేమన, సుమతి శతక కంఠస్థ పోటీలను నిర్వహించి 12 మంది విజేతలకు జ్ఞాపికలు, బహుమతులను అందజేశారు. అనంతరం పలువుర్ని సత్కరించారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, డాక్టర్ గిరిజాలక్ష్మి, డాక్టర్ సూరం శ్రీనివాసులు, విశ్రాంత అధ్యాపకులు పద్మనాభం, కొండా వెంకటస్వామిరెడ్డి, అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజ అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

- గడప గడపకు కార్యక్రమంలో సమస్యల గుర్తింపు
- యుద్ధ ప్రాతిపదికన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం



పల్లెల్లో పూర్తయిన సిమెంటురోడ్డు

పొదలకూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలంలో 23 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మంత్రి స్థాయిలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకుంటుండడంతో గ్రామాల్లోని కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండల పరిధిలో..

ఎన్నో ఏళ్లగా పరిష్కారానికి నోచుకోని సమస్యలతో పాటు రోడ్లు, సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం కూడా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పూర్తి చేశారు. ఇందుకోసం సచివాలయాలకు అందజేస్తున్న నిధులతో పాటు వివిధ రకాలుగా నిధులను మంత్రి కాకాణి సమకూర్చుతున్నారు. మరుపూరు బీసీ కాలనీ, పొదలకూరు పట్టణంలోని అగచాట్లపురం, శింగయ్యచేను, టైలర్స్‌కాలనీల్లో 11 కేవీ విద్యుత్ లైన్లు ఎప్పటి నుంచో ఇళ్ల మీదుగా ఉన్నాయి. ఇందువల్ల కాలనీవాసులు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీసేవారు. వర్షాకాలంలో తీగలు రాజుకుని నిప్పులు కురిసేవి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కాకాణి దృష్టికెళ్ళ వెళ్లడంతో సుమారు రూ.కోటి అంచనాలతో స్తంభాలు మార్పించి సమస్యకు పరిష్కారం చూపారు. బిరదవోలు సచివాలయ పరిధిలో కల్యాణపురం గ్రామానికి పాత విద్యుత్ లైన్‌ను మార్చి కొత్తగా ఏర్పాటు చేశారు. వరదాపురం మైన్ వద్ద స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న గిరిజనులకు సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతుండగా గడప గడపకు మన ప్రభుత్వంలో వారి సమస్యను గుర్తించిన మంత్రి రూ.35 లక్షలతో సిమెంటురోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో గిరిజనుల సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. ఇప్పటికే విరువూరు, నేదురుమల్లి, పులికల్లు, డేగపూడి, మరుపూరు, పొదలకూరు, పులికల్లు, దుగ్గుంట, తాటిపర్తి, ఆర్‌వైపాళెం, ప్రభగిరిపట్నం, మొగళ్లూరు, కనుపర్తి, ఇనుకుర్తి సచివాలయాల పరిధిలో గుర్తించిన రోడ్లు, సైడ్‌డ్రెయిన్ల పనులు పూర్తి చేశారు. చిన్నపాటి సమస్యలైతే అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నిప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నందున దీర్ఘకాలిక సమస్యలకు వెంటనే పరిష్కారం లభించింది.



కల్యాణపురం గ్రామానికి వేసిన కొత్త విద్యుత్ లైన్

నేడు నార్తురాజుపాళెంలో జన భాగీధారీ

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో జన భాగీధారీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఈనెల 19న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో అప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా జన భాగీధారీ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తొలుత నార్తురాజుపాళెంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు జన భాగీధారీ కార్యక్రమం జరుగుతుందన్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ముఖ్యఅతిథిగా హాజరై రాజ్యాంగ ప్రవేశికను చదివి ప్రజలకు వినిపిస్తారన్నారు. అనంతరం మండలంలోని 12 అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, వలంటీర్‌లు హాజరు కావాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

పొదలకూరు : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు లింగంపల్లి ఎస్సీకాలనీలో సీజనల్ వ్యాధులపై ఆదివారం అవగాహన కల్పించారు. జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఇంటింటి సర్వే నిర్వహించి చెత్త కుండీలను ఏర్పాటు చేసుకుని చెత్త వేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నరుకూరు చర్చిలో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను అందజేస్తున్న సంఘ పెద్దలు

తోటపల్లిగూడూరు : మండలంలోని నరుకూరు పంచాయతీలో ఉన్న బాప్టిస్ట్ చర్చిలో 200 మంది పేదలకు ఆదివారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మత పెద్ద నోవహు మాట్లాడుతూ ప్రతి ఏడాది నరుకూరు బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ పండగ రోజున దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతామని, ఈ ఏడాది కొంత ఆలస్యంగా పంచుతున్నట్లు తెలిపారు. సంఘ చైర్మన్ సాదేపల్లి బోయదాసు మాట్లాడుతూ పొరుగు వారిని ప్రేమించడం అనే ఏసుక్రీస్తు ప్రవచనాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. చర్చిలోని విశ్వాసుల సహకారంతో ప్రతి ఏడాది పేదలకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు దువ్వూరు మంజులమ్మ, సాదేపల్లి బాలప్రసాద్, దువ్వూరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓడూరు శ్రీనివాసులురెడ్డికి నివాళి



శ్రీనివాసులురెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు : రోడ్డు ప్రమాదంలో మరణించిన మనుబోలుకు చెందిన బీజేపీ మండలాధ్యక్షుడు ఓడూరు శ్రీనివాసులురెడ్డి మృతదేహాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. మనుబోలులోని పిడూరురోడ్డులో ఉన్న శ్రీనివాసులురెడ్డి నివాసానికి మంత్రి కాకాణి ఆదివారం వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రవీందర్ రెడ్డి, హరనాథ్‌రెడ్డి, కోటేశ్వరగౌడ్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్లు, స్ట్రెచర్ల వితరణ



నెల్లూరు సిటీ: నగరంలోని జీజీహెచ్‌కు పది వీల్‌చైర్లు, ఆరు స్ట్రెచర్లను ఆదివారం అందజేశారు. ఆదిత్యనగర్‌కు చెందిన బిజివేముల చెంచురెడ్డి 13వ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఆయన కుటుంబసభ్యులు చేపట్టారు. ఈ సందర్భంగా రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. తమ తండ్రి వర్ధంతిని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలను ఏటా నిర్వహిస్తున్నామని, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు వీటిని అందజేశామని తెలిపారు. జీజీహెచ్ డెవలప్‌మెంట్ సొసైటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద, వైద్యుడు మస్తాన్‌బాషా, హెచ్‌ఓడీ కళారాణి, దాతల కుటుంబసభ్యులు కౌశిక్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, సీతారామపురం మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, పాముల రమణయ్య, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా మహాసభ

నెల్లూరు(పొగతోట): ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిలా మహాసభను నగరంలోని జెడ్పీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో ఆదివారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన షేక్. మున్వర్ పని నిమిత్తం బైక్‌పై నెల్లూరుకు వెళ్తుండగా, కాకుటూరు సమీపంలో కారు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మున్వర్‌కు గాయాలవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఇందుకూరుపేటలో ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

ఇందుకూరుపేట : కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం మండలంలో పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి, ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకూరుపేటలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్యశాలను ప్రారంభించడంతో పాటు నూతనంగా మంజూరైన పింఛన్లతో పాటు విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేపడుతారన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎన్నడూ లేని విధంగా సంక్షేమం అమలు

- వైఎస్సార్‌సీపీని ఆదరించండి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు 18వ వార్డు కౌన్సిలర్ మోర్ల జయంతి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ 18వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత పెంచలయ్య, వలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం ఉపాధ్యాయుడికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న సుధీర్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ ఆదివారం రాజమహేంద్రవరంలో సాంస్కృతిక బంధు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాష ఉన్నతికి కృషి చేస్తున్నందుకు గుర్తింపుగా అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్ రాయ్ చేతుల మీదుగా తెలుగు మహాసభల్లో అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

యోగా పోటీల్లో మొదటి బహుమతి



బహుమతి అందుకుంటున్న రాజేంద్రకుమార్

కొడవలూరు : జిల్లాలోని జలదంకి ఆయుర్వేద వైద్యశాల సమీపంలో రాయల్ కాగభుజేందర్ పంచకర్మ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి యోగా పోటీలను ఆదివారం నిర్వహించారు. ఇందులో గండవరం ఆయుర్వేద వైద్యశాల యోగా గురువు జ్యోతి రాజేంద్రకుమార్ ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకున్నారు. అనంతరం రాజేంద్రకుమార్ మాట్లాడుతూ యోగాపై ఉన్న ఆసక్తి వల్ల రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు గెలుపొందుతున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు



ముగ్గులు వేస్తున్న చిన్నారులు



బహుమతుల ప్రదానం

కోవూరు: మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో రంగవల్లుల పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థినులు ఎంతో అందంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమాధికారిణి నాగభూషణమ్మ మాట్లాడుతూ జిల్లా బీసీ వెల్ఫేర్ శాఖ ఆదేశాల మేరకు విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. మొదటి బహుమతిని బాలచంద్రిక, సింధు కైవసం చేసుకోగా.. రెండో బహుమతిని పి.పోలమ్మ, భవానీ, మూడో బహుమతిని కీర్తన, నాలుగో బహుమతిని దీవెన, సాయి కైవసం చేసుకున్నారు.

రూ.3 వేల పింఛన్ చరిత్రాత్మకం



పింఛన్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు

కోవూరు : భారతదేశంలో రూ.3 వేల పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఇది చరిత్రాత్మకమని డీఎల్డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. కోవూరు మండలం పడుగుపాడు సచివాలయ పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అహ్మద్‌బాషా, జల్‌జీవన్ మిషన్ డైరెక్టర్ రాధాకృష్ణ, రాఘయ్య, నావూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన రైతు బజార్



బజార్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలు



పొదలకూరు రైతు బజార్

పొదలకూరు : పట్టణంలోని మెయిన్ రోడ్డుకు ఆనుకుని అందరికీ అనుకూలమైన ప్రాంతంలో రైతు బజార్ కొలువుదీరింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతు బజార్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దీంతో రూ.45 లక్షలతో రైతు బజార్ నిర్మాణం పూర్తి చేసుకుంది. ఇటీవల రైతుబజార్‌ను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే ప్లాట్‌ఫామ్స్ కేటాయించిన వారు తాము తీసుకొచ్చిన సరుకులను అమ్ముకునేందుకు కొంత జాప్యం చేయడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు కలుగచేసుకుని వారి వద్ద సరుకులను ఏర్పాటు చేయించారు. దీంతో ప్రస్తుతం చుట్టుపక్కల రైతులు పండించిన కూరగాయలు, పండ్లు, పూలను బజార్‌లో అమ్ముతున్నారు. మొత్తం 20 ప్లాట్‌ఫామ్స్‌తో పాటు మరుగుదొడ్లను సైతం నిర్మించారు. మిగిలిన ప్లాట్‌ఫామ్స్‌లో కూడా దుకాణాలు తెరుచుకుంటాయని అధికారులు వెల్లడించారు.